

కథా కౌముది

# నా వూరికేమయ్యింది?

ఆర్.సి.కృష్ణస్వామి రాజు

పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
కౌముది నిర్వహించిన కథల పోటీ (2021)లో
సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ

చల్లటి చిరుగాలుల సాయంత్రం–

చెన్నై విమానాశ్రయంలోని విద్యుత్ దీపాల వెలుగు పట్ట పగులును మరిపిస్తోంది. తల వంచుకుని నేలనే కన్నార్పకుండా చూస్తున్నాడు సుకుమార్. తన ప్రమేయం లేకుండానే కన్నీళ్ళు బొటబొటా కారుతున్నాయి. వెయిటింగ్ హాల్ లో తను ఎక్క వలసిన సింగపూరు విమానం కోసం ఎదురు చూస్తూ దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు.

తెరలు తెరలుగా జరిగిన సంఘటనలు మదిలోకి వచ్చాయి.

XXXXXX

ఎప్పుడో అరవై ఏళ్ల క్రితం పొట్ట చేత బట్టుకుని కేరళ రాష్ట్రం నుంచి వచ్చిన కుటుంబం పద్మనాభంది. పెళ్లిళ్లకు, పేరంటాలకు మంచి వంటలు వండే వాడు. ఉన్న ఒక్కగానొక్క కొడుకును గొప్ప చదువులు చదివించినాడు. కొడుకు సుకుమార్ సింగపూరులో పెద్ద సాఫ్ట్ వేర్ కంపెనీ కి సి.ఇ.ఓ అయినాడు.

పెళ్ళాం పోయి పదేళ్ళు అయినా పద్మనాభం ప్రాణం 'ఊరు..ఊరు' అని కొట్టక లాడేది.

ఎవరైనా "సింగపూరు వెళ్ళి జాలీగా ఉండరాదా" అని అడిగితే, "నేను సింగపూరు వెళ్ళినా ఇల్లు వదిలి ఎక్కడికీ పోను. కాబట్టి మన ఊర్లోని ఇంట్లో ఉన్నా, సింగపూరులో ఇంట్లో ఉన్నా ఒకటే కదా" అని నవ్వుతూ బదులిచ్చేవాడు.

ఊర్లో పెద్దగా మాట్లాడే వాళ్ళు లేరని ఒక మేకను మేపే వాడు. దాని ఆలనా పాలనా చూడడం తోనే రోజంతా గడిపే వాడు. దానికేదో అర్థమైనట్లు దాని పక్కనే కూర్చుని మంచి చెడ్డలు మాట్లాడేటోడు.

XXXXXX

మేత కెళ్ళిన ఆవులు తిరిగి వచ్చే వేళ–

కాపర్లు వస్తూ వస్తూ మలయాళ మోళ్ళ బావి కాడ ఆగినారు.

మెట్లు లేని బావిలో అరవై ఆరేళ్ళ పద్మనాభం శవం తేలుతోంది. బావి చుట్టూ మేక తిరుగుతోంది. కాపర్లకు అర్థమై పోయింది. మేత గడ్డి కోసం మేకను అక్కడికి తీసుకొచ్చిన ఈత రాని పద్మనాభం, పొరబాటుగా బావిలో పడి పోయినాడని.

పరుగులు తీస్తా ఊర్లోకి పోయినారు. రచ్చ బండ కాడ నిలబడి గట్టిగట్టిగా అరిచినారు. ఆడోళ్ళు గుంపుగా చేరి " ఒంటిగాడు..ఉన్న ఒక్కడూ పోయినాడా?" అని ముక్కు మీద వేలేసుకున్నారు.

మగాళ్ళు కొద్ది మంది పోగైనారు.

బయలుదేరే ముందు పోస్టాఫీసు ఆయన, మా బిడ్డకు పెండ్లి పత్రిక రాసినాము, శవం కాడికి రానని చెప్పినాడు. రేషన్ షాప్ రెడ్డి వస్తానని బయలుదేరినాడు కానీ, భార్య ఇంట్లోంచి బయటికి వచ్చి ఉరిమి చూసేసరికి చిన్నగా అక్కడి నుండి జారుకున్నాడు.

పాత పేపర్లు అమ్మే వాడు సర్రున సైకిల్ పై వచ్చినాడు. "నా భార్యకు అయిదో నెల. నేను శవం కాడికి పోకూడదంట. మా అమ్మ చెప్పింది. మా అమ్మకు తెలియకుండా వస్తే మల్ల ఇంట్లోకి కూడా రానీయదురబ్బా" అని చెప్పి సర్రున సైకిల్ తొక్కుకుంటూ వెళ్లి పోయినాడు.

మిగిలినోళ్ళు కర్రలు, చేంతాళ్ళు, టార్చిలైట్లు తీసుకుని బావికాడికి బయలుదేరినారు.

పట్టు పంచె పెద్దాయన గెనాల మీద నడుస్తూ "పాపిష్టోడు, బంగారం లాంటి కొడుకు సింగపూర్ లో కోట్లు సంపాదిస్తున్నాడు. అక్కడికి కొడుకు రమ్మని వేయి రకాలుగా అడుక్కున్నా వెళ్ళ లేదు. ఈ ఊర్లోనే పుట్టినాను, ఈ ఊర్లోనే పెరిగినాను, ఈ ఊర్లోనే చచ్చిపోతాను అనిన పిచ్చిమారాజు. అనుభవించేదానికి కూడా రాసి పెట్టి ఉండాలిలే. ఏముండాది ఈ ఊర్లో? నిద్ర లేచి చూసిన ముఖాలనే పడుకునే ముందు వరకు చూడాల. పచ్చ నోటు చూడాలంటే పది దిక్కల్ల తిరగాల. ప్రాణం మీదికి వస్తే పైసలెత్తుకుని పట్టణాలకు పరుగులు తీయాల"

పాత కరణం కొడుకు సింగపూరు లో ఉండే పద్మనాభం కొడుకు సుకుమార్ కి ఫోన్ చేసి విషయం చెప్పినాడు.

వెంటనే టికెట్ బుక్ చేసుకుని విమానంలో వస్తానని బదులిచ్చాడు.

ధైర్య శాలులైన ఇద్దరు బావిలోకి దిగారు. గట్టిగా శవాన్ని చేంతాళ్ళతో కట్టారు.

ఇంతలో గళ్ళ లుంగీ ఆయనకు అనుమానమొచ్చింది.

"ప్రమాదవశాత్తు బావిలో పడిపోయినాడని పోలీసులకు చెప్పాలేమో "

"పోలీసులు, కేసులు...అవన్నీ ఎక్కడ పడతాామురా నాయనా, దిక్కుమాలిన సమస్యలు. శెనిక్కాయలు తిని చేయి కడుక్కున్నట్లు, కొడుకు వచ్చిందే కాల్చేస్తే సరిపోతుంది".

బావిపైన ఉన్నోళ్ళు పై నుంచి లాగి శవాన్ని పైకి తీశారు.

శుభ్రమైన ప్రదేశంలో శవాన్ని పడుకో బెట్టేటప్పుడు సింగపూరు నుంచి ఫోన్ వచ్చింది. "విమానం టికెట్ ఈ రోజు రాత్రికి దొరకడం లేదు. ఉదయం అయిదు గంటలకి మాత్రమే దొరుకుతోంది. నేను చెన్నై మీనంబాకం విమానాశ్రయంలో దిగి ట్రావెల్స్ వారితో మాట్లాడి వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న మన ఊరికి వచ్చేలోగా ఉదయం పది గంటలవుతుంది" అని చెప్పాడు.

నాలుగు మూరల పంచె కట్టే ముసలాయన 'రాత్రి అవుతోంది. రాత్రుల్లో శవాన్ని శ్మశానానికి తీసుకుని వెళ్ళలేము, ఊరిలోకి శవాన్ని తీసుకు పోదామంటే వీళ్ళకు దాయాదులు కానీ బంధువులు కానీ ఎవ్వరూ లేరు. ఉండే ఒక్క కొడుక్కీ పెండ్లీ పెటాకులు లేక పాయె. చచ్చినోడు పసి వాడు కాదు కాబట్టి పడీపడీ ఏడ్చే వాళ్లెవ్వరూ లేరు. శవం ఊర్లో ఉంటే ఊర్లో వాళ్ళందరికీ జాగరణ అవుతుంది. కొడుకు ఎప్పుడో తెల్లారి పది గంటలకు వస్తే శవం కాడ కాపలా ఉండేదెవరు? వాళ్ళ వాళ్ళ బతుకులు వాళ్ళకి ఉండిపాయె" అని దీర్ఘాలు తీస్తూ చెప్పి నాడు.

"మరి శవాన్ని ఏమి చేద్దామబ్బా, అంతసేపు కాపలా ఎవరు ఉంటారు?" అని గుంపుగా కూర్చుని మాట్లాడుకున్నారు.

చీకట్లో శవం పక్కన ఇంకా ఎందుకుండావని ఇంట్లో ఆడోళ్ళు అరస్తా ఉంటే ఇద్దరు మొగోళ్ళు వెళ్ళిపోయారు.

గుడుగుడు మోటార్ సైకిల్ లో భార్యతో వెళుతున్న పెయింట్ షాప్ ఆయన విషయం ఏమిటని బండి ఆపి అడిగినాడు. ఇంతలో అతడి భార్య సీరియల్ కి టైం అవతా ఉందని, వెంటనే ఇంటికి తీసుకు పొమ్మని చెవిలో చెప్పి నడుము మీద గిచ్చింది. చేసేదేమీ లేక "సరేలే, పని కానివ్వండి" అని చెప్పేసి బండి రైజ్ చేసి వెళ్ళిపోయాడు.

ఎనిమిది మూరల పంచె కట్టిన తెల్ల మీసాలాయన చిన్న స్టీలు డబ్బాలోని ముక్కుపొడి కొంచెం ఎడమ అరచేయిలో వేసుకున్నాడు. కుడి చేయి వేళ్ళతో దిట్టంగా తీసుకుని రెండు ముక్కుల్లోనూ గట్టిగా లాగి 'హమ్మయ్య' అనుకున్నాడు.

"వేరే ఆలోచనలు ఏమీ లేకపోతే భద్రంగా శవాన్ని బావిలోకి దించేద్దాం" అని సలహా ఇచ్చాడు.

అనుకున్నదే ఆలస్యం, క్షణాల్లో శవాన్ని బావిలో దించేసారు. మళ్ళీ రేపు బావిలో దిగి ఎత్తవలసిన అవసరం లేకుండా చేంతాడును షెడ్డు పక్కనున్న కరెంట్ పోల్ కు గట్టిగా కట్టినారు. స్విచ్ వేసి బావి మోటర్ నీళ్ళ తో తల స్నానం చేసినారు. తలా ఒక దిక్కు వెళ్ళినారు.

అందరూ ఇండ్లకు వెళ్ళినా మేక మాత్రం రాత్రంతా బావి చుట్టూ చుట్టకలాడింది. మేకకు తోడుగా మిణుకుమిణుకు మని మెరిసే మిణుగురు పురుగులు రాత్రంతా నైట్ డ్యూటీ చేశాయి.

తెల్లారింది. ఊర్లో వాళ్ళు...వాళ్ళ వాళ్ళ పనుల్లో వాళ్ళు లీనమైనారు.

పది గంటలప్పుడు సింగపూరు నుంచి సుకుమార్ కారులో వస్తున్నాడని తెలుసుకుని కొందరు బావి కాడికి చేరినారు. బావిలో నుంచి శవాన్ని బయటకు తీసి పెట్టినారు. మేక చెంగుచెంగుమని పరుగులు తీస్తూ వచ్చి సుకుమార్ కాళ్ళకు చుట్టుకుంది.

శవాన్ని శ్మశానం దగ్గరికి తీసుకెళ్తుంటే ఊర్లో వాళ్ళు సినిమా చూసినట్లు చూసినారు. ఆడవాళ్ళ మనసు వెన్న పూస అని అంటారే, బాధ అనే సెగ తగిలితే కరిగి పోతుందంటారే ....అట్లాంటిది...ఒక్కరంటే ఒక్కరి కళ్ళు కూడా తడి కాలేదని సుకుమార్ మనసు నొచ్చుకుంది.

పక్కనే ఉన్న పాత కరణం కొడుకు “మన పక్క ఊర్లో ఉన్న ఈరమ్మ బృందాన్ని పిలవమంటారా సార్” అని అడిగాడు.

“వారెందుకు?వాళ్ళొచ్చి ఏమి చేస్తారు” అని అడిగినాడు.

ఈరమ్మ బృందంలో పది మంది ఆడోళ్ళు ఉంటారు సార్. వాళ్ళకి చెన్నై సిటీలో మంచి డిమాండ్. డబ్బులిస్తే శవాల దగ్గర పడీపడీ ఏడుస్తారు. దగ్గర బంధువుల కన్నా బాగా రాగాలు తీస్తూ తల, ఎద బాదుకుంటారు. చూసే వాళ్ళకి ‘అబ్బ...చచ్చిపోయినోళ్ళ బంధువులు ఎంత బాధపడుతున్నారో’ అనే ఆలోచన రావడానికి వారు అలా చేస్తారు సార్. వీళ్ళు ఏడిస్తే సహజంగా ఉంటుందని అప్పుడప్పుడు సినిమా వాళ్ళు షూటింగ్ లకు కూడా తీసుకు పోతూ ఉంటారు ’ అని బదులిచ్చాడు.

‘ఆ’ అని నోరు తెరిచినాడు సుకుమార్.

“వాళ్ళు మామూలుగా సిటీలో ఉండే వాళ్ళకి గంటకి పది వేలు ఛార్జ్ చేస్తారు. ప్రయాణ చార్జీలు, టీ, భోజనం ఖర్చులు పిలిచిన వాళ్ళే భరించాల్సి వస్తుంది. కానీ మనం తెలిసిన వాళ్ళు కాబట్టి మనకి డిస్కౌంట్ ఇస్తారు లెండి” అని వివరించినాడు.

గుండెల మీద గూడ్సు రైలు పరుగులు తీసినట్లయ్యింది సుకుమార్ కి. ‘ఎక్కడో పెద్ద పెద్ద సిటీలలో ఉండే ఈ జాడ్యం మన పల్లెటూర్లకి కూడా వచ్చిందా’ అని ఆశ్చర్య పోయినాడు.

అలాంటి బాడుగ ఏడుపులు మనకి వద్దని చెప్పి శ్మశానానికి బయలుదేరినారు.

శ్మశానం కాడికి వచ్చేసరికి ఊర్లో వాళ్ళు పట్టుమని పది మంది కూడా లేరు. సుకుమార్ నాయన చనిపోయి నాడే...అయ్యో పాపం..అని ఒక్క నరమానవుడు కూడా అనలేదు. వచ్చిన వాళ్ళు కూడా మొక్కుబడిగా కార్యం జరిపారు తప్పితే... మనసుతో కాదు.

సుకుమార్ మనసులో ఏదో తెలియని బాధ.

శవ దహనం జరిగిపోయింది.

ఇంటికెళ్ళి బ్యాగు సర్దుకుని ఇంటి బయటికి వచ్చాడు.

ఇంటి ముందర వేప చెట్టుకు కట్టి ఉన్న మేక బేలగా కనిపించింది. దీనంగా "నాన్న అందనంత దూరానికి వెళ్ళిపోయాడు, నీవూ వెళ్లి పోతున్నావా" అన్నట్లుగా చూసింది. సుకుమార్ మనసు బాధగా మూలిగింది. బ్యాగు పక్కన పెట్టి, పక్కనే ఉన్న బీడు పొలం గెనుము మీద ఉన్న గడ్డి కొంచెం కోసినాడు. మోకాళ్ళ మీద కూర్చుని మేకను ముద్దులాడినాడు. దాని తలను నిమురుతూ గడ్డి తినిపించినాడు. అది తింటూ తింటూ సుకుమార్ కళ్ళలోకి చూడసాగింది. దాని చూపుల నుంచి తప్పించుకుని లేచి నిలబడ్డాడు. పక్కనే ఉన్న పాత కరణం కొడుకును పిలిచి మేక మంచి చెడ్డలు చూసుకొమ్మని చెప్పి డబ్బులిచ్చి వెనక్కి తిరిగి చూడకుండా విమానాశ్రయం వచ్చేసినాడు.

XXXXXX

విమానాశ్రయంలో సందడి మొదలయ్యింది.

సినీ నటుడు సామంత అప్పుడే విమానాశ్రయం లోకి ప్రవేశించాడు. ప్రయాణీకులంతా అతడి హావ భావాలను ఆసక్తిగా, కన్నార్పకుండా చూస్తున్నారు.

కూర్చున్న వారందరినీ ఓర చూపుతో చూసిన నటుడికి మూలగా కూర్చుని ఉన్న సుకుమార్ కనిపించాడు.

" హలో సార్! ఎలా ఉన్నారు...

మీ గుండె...

అదే.. మీ ఊరు ఎలా ఉంది....మీ ఊరి గాలిలో అమ్మ జోల, ఊరి నేలలో నాన్న ప్రేమను చూసే మనిషి మీరు. ఎంత దూరమెళ్ళినా ఊరి మట్టి వాసన నుంచి నేను పారిపోలేను సార్ అని చెప్పే గొప్ప వ్యక్తి మీరు.

మీ ప్రాణంగా భావించే మీ ఊరి బడి భవనం ప్రారంభోత్సవానికి నన్ను తీసుకెళ్లారుగా...రంగ రంగ వైభోగంగా కార్యక్రమం జరిపారుగా...ఎంతైనా మీరు గ్రేట్ సార్. దేశం మారినా, సముద్రాలు దాటినా, పుట్టి పెరిగిన ఊరిని మరవలేదు"

అంత పెద్ద నటుడు నిలబడి తన గురించి, తన ఊరి గురించి అడుగుతుంటే సుకుమార్ నోట మాట రాలేదు. కళ్ళలో కన్నీటి జీర. చిన్నగా నవ్వి ఊరుకున్నాడు. ఇంతలో సినీ నటుడి విమానం రావడంతో టాటా చెప్పేసి వెళ్ళిపోయాడు.

ఆలోచనల సుడిగుండం సుకుమార్ మనసును చుట్టిముట్టింది.

"ఊరి నేలతో పెన వేసుకుపోయిన జీవితం నాది, అన్నీ తెలిసిన ముఖాలు. నాదీ, నీదీ అనే తేడా లేకుండా పెరిగిన ఊరు. కులాలు వేరైనా, అన్నా మామా అనుకునే స్నేహాలు.

ఊరు ఎందుకిలా మారిపోయింది? ఎవరింట్లో ఉన్నా, ఎవరింట్లో తిన్నా, అందరం ఒకటే అనుకునే మనుషులు.. ఊరంటే ఉమ్మడి కుటుంబం అనుకున్న వాళ్ళు. ఎందుకింత ఇరుకుగా ఆలోచిస్తున్నారు.

నేను మాత్రమే గెలవాలని కాకుండా ఊరంతా గెలవాలని కోరుకున్న మనుషులేనా వీళ్ళు? బావిలో నుండి ఎత్తిన శవాన్ని మళ్ళీ బావిలో విడిచి పెట్టడానికి వారికి మనసు ఎట్లా ఒప్పింది?

దూర దేశంలో ఉండి మా ఊరు అంత గొప్ప, మా వాళ్ళు ఇంత గొప్ప అని పొగడ్తల వర్షం కురిపిస్తామే....

దూరపు కొండలు నునుపు, దగ్గరికి పోతే పెద్ద పెద్ద బండలేనా?

పైకి చూసేదానికి అందరూ ఒకటిగా ఉన్నట్లు కనిపించినా ఈర్ష్య, ద్వేషం, అసూయలతో ఒకరికొకరు చాలా దూరంగా జరిగి పోతున్నారా?

ఎవ్వరికీ నేను చీమంత కష్టం పెట్టలేదే. దేశం కాని దేశంలో కష్ట పడి సంపాదించిన డబ్బును ఊరి కోసం ఖర్చు పెట్టానే...

నాది అనుకున్న ఊరిలో నా వారి గురించి ఒక్క చుక్క కన్నీటి బొట్టును రాల్చే వారు లేరా? మన మనుషులు అనుకున్న వాళ్ళు శ్మశానం వరకైనా నడిచి రాలేరా?..."

సుకుమార్ మనసు బాధగా మూలిగింది. తను ఎక్కాల్సిన విమానం వచ్చిందని అనౌన్స్ మెంట్ వచ్చింది. గబగబా లేచి బ్యాగును ఒక చేతిలోకి తీసుకుని ఇంకొక చేతితో సెల్ అందుకున్నాడు.

తను కట్టి ఇచ్చిన ఊరి బడి భవనం బొమ్మ, సెల్ స్క్రీన్ పై తళ తళా మెరుస్తోంది.

COMMENTS